TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 86 | బుధవారం, జూలై 24, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## 2024 బడ్జెట్‌ను ప్రశంసించిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ, నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్-2024ను ప్రశంసించారు. 'ఈ బడ్జెట్ సమాజంలోని ప్రతి వర్గాన్ని బలోపేతం చేస్తుంది. ఈ బడ్జెట్ దేశంలోని పేదలు, గ్రామాలు, రైతులను సౌభాగ్యం దిశలో నడిపించనున్నది" అని ఆయన వీడియో సందేశం ద్వారా తెలిపారు. "గత 10 ఏళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఈ బడ్జెట్ కొత్త మధ్యతరగతి సాధికారత కోసం. ఈ బడ్జెట్ ద్వారా యువతకు అపరిమిత అవకాశాలు లభిస్తాయి. ఈ బడ్జెట్ నుండి విద్య, నైపుణ్యం కొత్త స్థాయిని పొందుతాయి.

ఈ బడ్జెట్ కొత్త మధ్యతరగతికి శక్తిని ఇస్తుంది.. ఈ బడ్జెట్ మహిళలు, చిన్న వ్యాపారులు, MSMEలకు సహాయం చేస్తుంది, "అని మోడీ అన్నారు. విద్య, నైపుణ్యానికి బడ్జెట్ కొత్త పీఠం వేస్తుందని ప్రధాని అన్నారు. "ఇది మధ్యతరగతి ప్రజలకు కొత్త బలాన్ని ఇస్తుంది. గిరిజనులు, దళితులు , వెనుకబడిన వారిని బలోపేతం చేసే లక్ష్యంతో ఇది బలమైన పథకాలతో వచ్చింది. ఆర్థిక భాగస్వామ్యానికి భరోసా కల్పించేందుకు ఈ బడ్జెట్ తోడ్పడుతుంది" అని ప్రధాని మోడీ అన్నారు.

### బడ్జెట్ వేళ.. చరిత్ర సృష్టించిన నిర్మలమ్మ..

# చీరచీరకో ప్రత్యేకత..!

- కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట.. రూ. 3 లక్షల కోట్లతో..
- పెళ్లిళ్ల సీజన్‌కు ముందే శుభవార్త చెప్పిన మోదీ సర్కార్..!
- భారీగా పడిపోయిన బంగారం, వెండి ధరలు.. వేలకు వేలే పతనం
- పెట్టుబడి వ్యయాలు యథాతథంగా రూ. 11.11 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: నేడు కేంద్ర బడ్జెట్ 2024ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఆమె తన ప్రసంగాన్ని ఆరంభిస్తూ ప్రభుత్వం పేదలు, మహిళలు, యువత, రైతులను దృష్టిలో పెట్లుకుని బడ్జెట్ ను రూపొందించిందని అన్నారు. ఈ తాత్కాలిక బడ్జెట్ లో ప్రభుత్వం తన పెట్టుబడి వ్యయం(క్యాపిటల్ ఎక్స్ పెండీచర్)ను ఏ మాత్రం మార్చకుండా యథాతథంగా రూ. 11.11 లక్షల కోట్లుగా ఉంచింది. ఐదేళ్లలో 20 లక్షల యువతకు కేంద్రం నైపుణ్య పథకాలు ప్రవేశపెట్టి శిక్షణ ఇవ్వనుందన్నారు. టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు 12 నెలల ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించేనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్న్ షిప్ భత్యంగా నెలకు రూ.5000, వన్ టైమ్ అసిస్టెన్స్ కింద రూ. 6000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక కంపెనీలు ఇంటర్న్ షిప్ వ్యయంలో 12 శాతం భరించాల్సి ఉంటుంది. బీహార్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తామని నిర్మలా సీతారామన్ అన్నారు. బీహార్ లో విమానాశ్రయాలు, మెడికల్ కాలేజ్ లు, క్రీడల మౌలిక వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## ప్రతి వర్గాన్నీ బలోపేతం చేసే బడ్జెట్: ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2024 కేంద్ర బడ్జెట్‌ను ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం బహుధా ప్రశంసించారు. 'ఈ బడ్జెట్ సమాజంలోని ప్రతి వర్గాన్నీ బలోపేతం చేస్తుంది. దేశంలోని నిరుపేదలు, గ్రామాలు, రైతులను సౌభాగ్య పథంలోకి బడ్జెట్ తీసుకువెళుతుంది' అని ప్రధాని ఒక వీడియో సందేశంలో సూచించారు. 'గడచిన పది సంవత్సరాల్లో ఐదు కోట్ల మందికి దారిద్ర్యం నుంచి విముక్తి లభించింది. ఈ బడ్జెట్ కొత్త మధ్య తరగతి సాధికారత కోసం ఉద్దేశించినది. యువతకు ఈ బడ్జెట్ నుంచి అపరిమిత అవకాశాలు లభిస్తాయి. విద్య, నైపుణ్య రంగాలు ఈ బడ్జెట్ నుంచి కొత్త స్థాయి పొందుతాయి. ఈ బడ్జెట్ కొత్త మధ్య తరగతికి అధికారం ఇస్తుంది & ఈ బడ్జెట్ మహిళలు, చిన్న వాణిజ్యవేత్తలు, ఎంఎస్ఎంఇలకు చేయూత ఇస్తుంది' అని మోడీ తెలియజేశారు. 'మధ్య తరగతికి ఇది కొత్త బలం ఇస్తుంది. ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన తరగతుల బలోపేతం లక్షంగా పటిష్ఠ పథకాలతో బడ్జెట్ వచ్చింది' అని ప్రధాని తెలిపారు. కేంద్ర 'ఉపాధి అనుసంధానిత ప్రోత్సాహక పథకం' (ఇఎల్ఐఎస్) గురించి కూడా ప్రధాని మాట్లాడారు. 'దీని వల్ల అనేక ఉద్యోగావకాశాలు కలుగుతాయి. ఈ పథకం కింద కొత్తగా శ్రామిక వర్గంలోకి చేరే వారికి ప్రభుత్వం తొలి వేతనాన్ని ఇస్తుంది. గ్రామాలకు చెందిన యువజనులు అప్రెంటిస్‌షిప్ కార్యక్రమం కింద దేశంలోని అగ్రశ్రేణి సంస్థల్లో పని చేయగలుగుతారు' అని మోడీ తెలిపారు. సంఘటిత రంగాల వ్యాప్తంగా శ్రామిక వర్గంలోకి కొత్తగా చేరేవారికి ఈ పథకం కింద ఒక నెల వేతనం ఇవ్వనున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలియజేశారు.

## ఇది పదవిని కాపాడుకునే బడ్జెట్: రాహుల్

న్యూఢిల్లీ : మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. బిజెపి మిత్ర పక్షాలను, 'ఆశ్రితులను' బుజ్జగించడం లక్షంగా దానిని రూపొందించారని రాహుల్ విమర్శించారు. బడ్జెట్‌ను 'కుర్సీ బచావో' (పదవిని కాపాడుకునేది'గా కాంగ్రెస్ నేత అభివర్ణించారు. దానిని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల ప్రణాళికలో నుంచి కాపీచేశారని రాహుల్ ఆరోపించారు. 'కుర్సీ బచావో బడ్జెట్. మిత్ర పక్షాలను బుజ్జగించండి: ఇతర రాష్ట్రాలను అలక్షం చేసి మిత్రులకు బోలు వాగ్దానాలు చేశారు. ఆశ్రితుల బుజ్జగింపు: ఎఎకు ప్రయోజనాలు, సామాన్య భారతీయునికి ఉపశమనం లేదు, కాపీ. అతికింపు: కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక, పూర్వపు బడ్జెట్‌లు దించేశారు' అని రాహుల్ గాంధీ 'ఎక్స్' పోస్ట్‌లో ఆరోపించారు. ఇతర కాంగ్రెస్ నాయకులు కూడా బడ్జెట్ కాపీ చేసినట్టిదని విమర్శించారు. 'ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ప్రణాళికను గౌరవనీయ ఆర్థిక శాఖ మంత్రి చదివారని తెలిసి ఆనందించాను. కాంగ్రెస్ మేనిఫెస్టో 30వ పేజీలో పేర్కొన్న ఉపాధి అనుసంధానిత ప్రోత్సాహకం (ఇఎల్ఐ)ని ఆమె అనుసరించినందుకు నాకు ఆనందంగా ఉంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 11వ పేజీ వివరించినట్లుగా ప్రతి అప్రెంటిస్‌కు ఒక భత్యంతో పాటు అప్రెంటిస్ పథకాన్ని ఆమె ప్రవేశపెట్టినందుకు కూడా నాకు సంతోషంగా ఉంది.

### కేంద్ర బడ్జెట్ పై ఏపీ

## మస్త్ హ్యాపీ



అమరావతి: ఏపీపై కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం కరుణ చూపింది. రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించింది. అమరావతితో పాటు వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. ఆయా ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించడంతో పాటు ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ కోసం 1500 కోట్లు ప్రకటించారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలను ప్రకటించారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తికి కట్టుబడి ఉన్నామంటూ నిధులు విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే విశాఖ, చెన్నై కారిడార్, ఓర్వకల్లు నుంచి బెంగుళూరు కారిడార్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అందుకు తగ్గట్లు నిధులు విడుదల చేస్తామని లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక సదుపాయాలు కల్పించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించేలా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. కేంద్ర బడ్జెట్ లో ఏపీకి ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని చెప్పారు.

## 'నీట్' పరీక్ష మరోసారి నిర్వహించాల్సిన అవసరం లేదు: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. సిజెఐ డివై.చంద్రచూడ్ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకైన మాట వాస్తవమేనని నిర్ధారించింది. బీహార్ లోని హజారీబాగ్ లో, పాట్నాలోనూ పేపర్ లీకైందని తెలిపింది. 150 మంది విద్యార్థులు నీట్ పేపర్ లీక్ తో లబ్ధి పొందారని సిజెఐ ధర్మాసనం వెల్లడించింది. దేశమంతా నీట్ పేపర్ లీకైనట్టు ఆధారాలు లేవని, అందువల్ల నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. నీట్ ఎంట్రెన్స్ రద్దు చేయాలన్న వాదనలో అర్థం లేదని, నీట్ పరీక్ష రద్దు చేస్తే 24 లక్షల మందిపై ప్రభావం పడుతుందని అభిప్రాయపడింది. కాగా లీక్ తో లబ్ధి పొందిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని సుప్రీం ఆదేశించింది. నీట్ నిర్వహణలో లోపాలు ఉన్నాయని అభిప్రాయపడింది.

## ఇది వివక్షే...

### తెలంగాణను నిషేధించిన కేంద్రం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు మొండిచేయి చూపడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఇది కక్ష పూరితం, వివక్ష అంటూ మండి పడ్డారు.. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ పదాన్ని కేంద్రం నిషేధించిదంటూ వ్యాఖ్యానించారు.. కేంద్ర అర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రెండున్నర గంటల ప్రసంగంలో అన్ని రాష్ట్రాల పేర్లు వినిపించినా తెలంగాణ పేరును పలకలేదన్నారు రేవంత్. సబ్ కా సాత్ పెద్ద బోగస్ అంటూ మండిపడ్డారు..వికసిత్ భారత్ లో తెలంగాణ లేదా? అంటూ నిలదీశారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయంపై చేశారంటూ దీనిపై నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. కొత్తగా తాము అధికారం చేపట్టిన తర్వాత తాము ఏడు సార్లు ఢిల్లీ పెద్దలను కలిశామని, ప్రధాని మోడీ తానే స్వయంగా మూడు సార్లు కలసి నిధులు కేటాయించవలసిందిగా అభ్యర్థించానని చెప్పారు సిఎం.. అయినా ఇసుమంతైన కనికరం చూపకుండా తెలంగాణ ప్రజలకు అన్యాయం చేశారంటూ వాపోయారు.. ఈ బడ్జెట్ మోదీ తన కుర్చి కాపాడుకునే బడ్జెట్ లా ఉందని అన్నారు.. తాము ఎపికి నిధులు,ప్రాజెక్ట్ లు ,పథకాలు ఇవ్వడాన్ని తప్పు పట్టడం లేదని, తమకు ఎందుకు ఇవ్వలేదో అని అడుగుతున్నామన్నారు.. పోలవరానికి నిధులు ఇస్తున్న కేంద్రం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఎందుకు నిధులు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు.

### ఇలాంటి తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వచ్చినందుకు

## బాధగా ఉంది: రేవంత్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ శాసన బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శాసన సభ ప్రారంభం కాగానే కంటోన్మెంట్ దివంగత ఎంఎల్ఎ లాస్య నందిత మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీర్మానం ప్రవేశం పెట్టారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఇలాంటి బాధాకరమైన తీర్మానం ప్రవేపెట్టాల్సి వచ్చినందుకు చాలా చింతిస్తున్నామని విచారం వ్యక్తం చేశారు. లాస్య నందిత తండ్రి, దివంగత ఎంఎల్ఎ సాయన్న తనకు అత్యంత సన్నిహితంగా ఉండేవారని, చాలా సంవత్సరాలు ఇద్దరం ప్రజాప్రతినిధులుగా కలిసి పని చేశామని, సాయన్న 1951లో నిజమాబాద్ జిల్లా వల్లభానగర్ లో అత్యంత సామాన్యమైన కుటుంబంలో సాయన్న జన్మించారని, జీవితంలో కష్టపడి ఐదుసార్లు ఎంఎల్ఏగా గెలిచి కంటోన్మెంట్ ప్రజలకు సేవలందించారని ప్రశంసించారు. ఆయన కంటోన్మెంట్ నిజయోకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఎంఎల్ఏగా ఉన్నప్పుడు సాయన్న కన్నుమూయడంతో లాస్య నందిత తన తండ్రి వారసత్వాన్ని, బాధ్యతలను నెరవేర్చేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఆయన బతికి ఉన్నప్పుడే ఆమె కార్పొరేటర్ గెలిచారని, లాస్య నందిత ఎంఎల్ఏగా గెలిచిన తరువాత కంటోన్మెంట్ ప్రజలు, మహిళల తరఫున చిత్తశుద్ధితో పోరాడుతున్న తరుణంలో ఆమె రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం దురదృష్టకరమైన విషయమని బాధను వ్యక్తం చేశారు.

# కూరగాయల సప్లయ్ చైన్ నిర్వహణకు కొత్త స్టార్టప్‌లు: నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, సుస్థిరత సాధనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్ సభలో మోడీ 3.0 పూర్తి స్థాయి వార్షిక బడ్జెట్ ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగించారు. కూరగాయల సప్లయ్ చైన్ నిర్వహణకు కొత్త స్టార్టప్‌లకు అవకాశం ఇస్తామని, సేకరణ, నిల్వ, సరఫరాకు తగిన పెట్టుబడులు అందుబాటులోకి తెస్తామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కూరగాయలు ఉత్పత్తి చేసే ఆరు కోట్ల మంది రైతుల డేటా సేకరిస్తున్నామని, వినియోగానికి ఎక్కువగా ఉండే ప్రాంతాలకు దగ్గరలోనే కూరగాయల ఉత్పత్తి క్లస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే ప్రయత్నం చేస్తున్నామని, వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వుల ఉత్పాదకత పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని నిర్మలా సీతారామన్ తెలియజేశారు. సహకార రంగాన్ని సుస్థిరం చేసేందుకు నిర్మాణాత్మక విధానాలు రూపకల్పన చేస్తున్నామని, ఆహార, ఇంధనేతర ద్రవ్యోల్బణం 3.1 శాతానికి పరిమితమైందని, ద్రవ్యోల్బణం నాలుగు శాతానికి పరిమితం చేయాలనే లక్షంతో ముందుకు సాగుతున్నామని, కనీసం 50 శాతం మిగులు ఉండేలా మద్దతు ధరలు సవరించామని, విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం లక్ష 48 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఉపాధి నైపుణ్య శిక్షణ, ఎంఎస్ఎంఇ, మధ్యతరగతి కేంద్రంగా బడ్జెట్ ఉంటుందన్నారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం చేస్తామని, అవసరాన్ని బట్టి అమరావతికి మరిన్ని అదనపు నిధులు ఇస్తామని, పోలవరం ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసేందుకు సంపూర్ణ సాయం అందిస్తామని ఆమె చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రైతులకు జీవనాడి పోలవరం అని, భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైందన్నారు. ఎపిలోని వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారు. విశాఖ పట్నం-చెన్నై కారిడార్‌లో కొప్పర్తితో పాటు హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో ఓర్వకల్లు అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన రాష్ట్రపతి



ఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2024-25 ప్రవేశ పట్టడానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. అనంతరం బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్రపతి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బడ్జెట్ ట్యాబ్లెట్‌తో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన పార్లమెంట్‌కు చేరుకున్నారు. కేంద్ర బడ్జెట్‌ను ఆమోదించడానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్రమంత్రి వర్గం పార్లమెంట్‌లో సమావేశమైంది. భారత దేశాన్ని అభివృద్ధి, ప్రగతి పథంలో నడిపించే విధంగా ఈ బడ్జెట్ ఉంటుందని కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా తెలిపారు. ఈ బడ్జెట్ అనేది ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షలకు అనుగుణంగా తయారు చేయడంతో పాటు వికసిత్ భారత్ లక్షంగా ముందుకు వెళ్తామని సింధియా స్పష్టం చేశారు.

## కేంద్ర బడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను 10% నుండి 12.5%కి పెంపు

న్యూఢిల్లీ: 2024-25 కేంద్ర బడ్జెట్‌లో అన్ని ఆర్థిక , ఆర్థికేతరాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుని 10 శాతం నుండి 12.5 శాతానికి పెంచింది ప్రభుత్వం, అయితే కొన్ని ఆస్తులపై స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను 20 శాతం ఉంటుంది. ఇంకా, దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను మినహాయింపు పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.1.25 లక్షలకు పెంచారు. ఒక సంవత్సరానికి పైగా ఉన్న లిస్టెడ్ ఫైనాన్షియల్ ఆస్తులను దీర్ఘకాలికంగా వర్గీకరిస్తామని బడ్జెట్ ప్రకటించింది.

"కొన్ని ఆర్థిక ఆస్తులపై స్వల్పకాలిక లాభాలు ఇకపై 20 శాతం పన్ను రేటును ఆకర్షిస్తాయి, అయితే అన్ని ఇతర ఆర్థిక ఆస్తులు , అన్నింటిపై ఆర్థికేతర ఆస్తులు వర్తించే పన్ను రేటును ఆకర్షిస్తూనే ఉంటాయి" అని జూలై 23న తన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సీతారామన్ 2024 బడ్జెట్‌లో సెక్యూరిటీలలో ఆప్షన్ అమ్మకంపై ఆప్షన్ ప్రీమియంలో 0.0625 శాతం నుండి 0.1 శాతానికి , సెక్యూరిటీలలో ఫ్యూచర్స్ అమ్మకంపై 0.0125 నుండి సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను రేట్లను పెంచాలని ప్రతిపాదించారు. అటువంటి ఫ్యూచర్స్ వర్తకం చేసే ధరలో శాతం నుండి 0.02 శాతం. క్యాపిటల్ గెయిన్స్ స్ట్రక్చర్‌లోని ట్వీక్‌లకు ప్రతిస్పందిస్తూ, సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా పతనంతో భారతీయ ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలాయి. ఇండెక్స్ కాస్త తర్వాత కోలుకుని 600 పాయింట్ల వరకు ఎరుపు రంగులో ట్రేడవుతోంది.

## ఆయనది ఆత్మహత్యే... బర్త్ డే రోజునే బలవన్మరణం

**విజయవాడ:** గత తొమ్మిది రోజులుగా.. నరసాపురం ఎంపీడీవో వెంకటరమణారావు.. మిస్సింగ్ మిస్టరీ కథ విషాదాంతమైంది. ఏలూరు కాలువలో మంగళవాకం ఆయన మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. గత తొమ్మిది రోజులుగా ఆయన మిస్టరీపై పోలీసు యంత్రాంగం మొత్తం దృష్టి కేంద్రీకరించింది. సెల్ లోకేషన్ తో ఆయన అదృశ్యమైన ప్రాంతంలో ఎన్డీఆర్ ఎఫ్ దళంతో జల్లెడ పట్టారు. చివరికి సోమవారం ఏలూరు కాలువలో నీటి ప్రవాహాన్ని నిలిపివేశారు. గత ఎనిమిది రోజులుగా రమణారావు మృతి చెందాడా? బతికి ఉన్నాడా? అనే మీమాంశలో పోలీసులు జుట్టుపీక్కున్నారు. ఎట్టకేలకు కాలువలో నీటిని అదుపు చేసి రమణారావు మృతదేహాన్ని గుర్తించారు. సీఐ రామారావు నేతృత్వంలో పోలీసులు రమణారావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవోగా పనిచేస్తున్న మండవ వెంకట రమణరావు.. విజయవాడ సమీపంలోని కానూరు మహాదేవపురం కాలనీలో నివాసం ఉంటున్నాడు. జులై 3వ తేదీ నుంచి సెలవు పెట్టారు. ఇటీవల కానూరులోని ఇంటికి వచ్చారు. 15వ తేదీన మచిలీపట్నంలో పని ఉందని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 10 గంటలకు ఫోన్ చేసి తాను మచిలీపట్నంలో ఉన్నానని.. ఇంటికి రావడానికి ఆలస్యమవుతుందని చెప్పారు. నా పుట్టిన రోజైన 16వ తేదీనే నా చావు రోజు కూడా.. అందరూ జాగ్రత్త అని అర్ధరాత్రి దాటాక కుమారుడికి ఒక మెసేజ్ చేశాడు. అదే విధంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రాసిన సూసైడ్ నోట్‌ను కూడా తన సెల్‌ఫోన్ నుంచి ఫ్యామిలీ మెంబర్స్‌కు పంపించారు. అందులో వైసీపీ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ప్రసాదరాజుపై తీవ్ర ఆరోపణలు చేశారు. నరసాపురంలో ఫెర్రీ లీజుకు సంబంధించి ప్రసాదరాజు అండదండలతో కాంట్రాక్టర్ రెడ్డప్ప బెదిరింపులు తాళలేకపోతున్నానని.. తనకు న్యాయం



చేయాలని అందులో పేర్కొన్నారు. ఇది చూసి ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి రమణరావు మెసేజీతో భయపడిన చిన్న కుమారుడు తెల్లవారుజామున03:00 గంటలకు పెనమలూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వెంటనే పెనమలూరు పోలీస్ లు స్పందించి ఆ తెల్లవారుజామునే ఒక బృందాన్ని మచిలీపట్నం రైల్వే స్టేషన్ కి పంపించారు. రైల్వే స్టేషన్ కి వెళ్లిన బృందానికి అక్కడ 15 వ తారీకు మధ్యాహ్నం 02:30 నిమిషాల సమయంలో విజయవాడ కు టికెట్ తీసుకున్న రమణ రావును సీసీ కెమెరా లో గుర్తించారు. .సీసీ కెమెరాల ఆధారంతో ప్రతి రైల్వే స్టేషన్ లో క్షుణ్ణంగా సెర్చ్ ఆపరేషన్ కొనసాగించారు.బి ఒకవైపు సీసీ కెమెరాలను ఒక బృందం పరిశీలిస్తుండగా మరొక బృందం ఆయన కాల్ డీటెయిల్స్ ను, గూగుల్ మ్యాపింగ్ ను అనుసరించారు. ఆయన మధురానగర్ స్టేషన్ లో దిగి అదే ప్రదేశంలో సంచరించినట్లు గుర్తించారు. తదుపరి ఆయన రెండవ ఫోన్ 16 న అర్ధరాత్రి చివరి ఆక్టివిటీని ఏలూరు కాలువ దగ్గర గుర్తించారు. వ్యక్తిగత కారణాలు దృష్ట్యా ఆత్మహత్య చేసుకున్నారనే అనుమానంతో ఏలూరు కాలువ చుట్టు పక్కల ప్రాంతాలను ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

### గ్యాంగ్‌స్టర్‌తో లేచిపోయిన ఐఎఎస్ భార్య...

# మళ్లీ ఇంటికొచ్చి ఏం చేసిందంటే?

గాంధీనగర్: గ్యాంగ్‌స్టర్‌తో పారిపోయిన ఐఎఎస్ అధికారి భార్య తొమ్మిది నెలల తరువాత తిరుగొచ్చి ఆయన ఇంటి ముందు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ లో జరిగింది. గుజరాత్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌లో రంజీత్ కుమార్ అనే అధికారి కార్యదర్శిగా పని చేస్తున్నాడు. రంజీత్ భార్య సూర్య జయ్ (45) తొమ్మిది నెలల క్రితం ఓ గ్యాంగ్‌స్టర్‌తో కలిసి పారిపోయింది. గ్యాంగస్టర్‌తో కలిసి తమిళనాడులో ఓ బాలుడిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించింది. మదురై పోలీసులు తక్షణమే స్పందించి బాలుడిని వారి నుంచి కాపాడారు. కానీ నిందితులను మాత్రం తప్పించుకున్నారు. సదరు గ్యాంగ్‌స్టర్, సూర్య జైన్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తమిళనాడు నుంచి తప్పించుకొని నేరుగా గుజరాత్‌లోని తన భర్త ఇంటికి వద్దకు వెళ్లింది. రంజీత్ ఆమెను ఇంట్లోకి రానివ్వకపోవడంతో పాయిజన్ తీసుకొని ఆత్మహత్యాయత్నం చేసి 108కు ఫోన్ చేసింది. 108 సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తరలించే చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె దుర్మరణం చెందిందని వైద్యులు వెల్లడించారు. రంజీత్ తరపు న్యాయవాది ఈ సంఘటనపై మీడియాతో మాట్లాడారు. రంజీత్-సూర్య జైన్ అనే



దంపతులు గత సంవత్సరం నుంచి వేరుగా ఉంటున్నారని, రంజీత్ విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, మూడు రోజుల క్రితం సూర్య జయ్ ఇంటికి వచ్చినప్పుడు పని వాళ్లకు ఆమెను ఇంట్లోకి అనుమతించొద్దని చెప్పి ఆయన బయటకు వెళ్లాడు. ఆమెను పనివాళ్ల ఇంట్లోకి రానివ్వకపోవడంతో అతడి ఇంటి ముందు ఆమె విషం తాగి ఆత్మహత్య చేసుకుందని వివరించారు. ప్రస్తుతం ఆమె మృతదేహాన్ని కూడా తీసుకెళ్లేందుకు రంజీత్ నిరాకరించాడు.

# ఆ వడ్డీ రైతులే కట్టాలని చెప్పడం సరికాదు: హరీష్ రావు

హైదరాబాద్: బడ్జెట్‌పై చర్చ సమాధానం ఒకే రోజులో పూర్తి కావాలనడం సరికాదని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. బడ్జెట్‌పై చర్చించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శలు గుప్పించారు. బడ్జెట్ చర్చను నాలుగు రోజులకు కుదించారని, కనీసం 15 రోజులు బడ్జెట్ సమావేశాలు జరపాలని బిఎసిలో డిమాండ్ చేశామన్నారు. బిఎసి సమావేశం అనంతరం అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద హరీష్ రావు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులపై కక్ష గట్టిందని, రేపు నిరుద్యోగుల సమస్యలపై చర్చ పెట్టాలని ప్రతిపాధించామని, లక్షలాది నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులపై అక్రమ కేసులు పెడుతున్నారని, ప్రధాని ప్రతిపక్షంగా నిరుద్యోగుల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. మరో ఎనిమిది సమస్యలను ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చామని, శాంతి భద్రతల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో భయానక వాతావరణం ఏర్పడిందని, చేనేత రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం గురించి చర్చ జరపాలని, బాండ్ పేపర్లు, ఆరు గ్యారంటీలపై చర్చించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీలో ఆంక్షలు పెట్టి రైతుల్ని ఇబ్బంది పెడతున్నారని, డిసెంబర్ 9 తరువాత ఉన్న వడ్డీ రైతులే



కట్టాలని చెప్పడం సరికాదని, పంటలకు బోనస్, రైతు భరోసాపై చర్చ జరగాలని, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతికి నిధులు ఎందుకు ఎత్తేశారని అడిగారు. స్థానిక సంస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ప్రజారోగ్యం దెబ్బతింటోందని, ఎనిమిది నెలలుగా ఒక్క రూపాయి కూడా పీజు రీయింబర్స్ ఇవ్వలేదని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కుప్పంకు పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తాం : నారా భువనేశ్వరి



**కుప్పం:** కుప్పంకు పరిశ్రమలు తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నాలుగు రోజుల పాటు కుప్పం నియోజకవర్గ పర్యటన నిమిత్తం మంగళవారం ఆమె విచ్చేశారు. మొదట శాంతిపురం మండలం వెంకటాపురంలో నారా భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గుడుపల్లి మండలం కుమ్మగుట్టపల్లి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లతో పాటు విశేష ఆహ్వానం పలికారు.

గత ఎన్నికల్లో ప్రచారంలో నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో అత్యధికంగా మెజార్టీ తెచ్చే గ్రామాన్ని దత్తత తీసుకొంటానని తెలియజేయడంతో మంగళవారం ఆమె కమ్మగుట్ట పల్లి బూత్ అత్యధిక మెజార్టీ రావడంతో ఆ గ్రామాన్ని దత్తత తీసుకొనేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ%ో% కుప్పంలో చంద్రబాబుని భారీ మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కమ్మగుట్ట పల్లి గ్రామంలోని మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. రాష్ట్రంలో జరిగిన అకృత్యాలకు, దౌర్జన్యాలను చుసిన మహిళలు కసితో టీడీపీకి ఓటేసి గెలిపించారని తెలిపారు. అలాంటి మహిళలకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని నారా భువనేశ్వరి తెలిపారు. అదేవిధంగా ప్రతి మహిళకు అండగా ఉండి స్వశక్తితో ఎదిగేలా అన్ని విధాలా ఉపాధి కల్పన కల్పించేందుకు చర్యలు తీసుకుం టామని ఆమె తెలిపారు. నిరుద్యోగులు బయట ప్రాంతాలకు ఉద్యోగం కోసం వెళ్లకుండా కుప్పంలోనే పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూడటమే కాకుండా వారు పదిమందికి ఉపాధి కల్పించేలా స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంను నిర్వహించడం జరుగుతుందని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో భూములు అన్యాక్రాంతం కావడంతో అనేక భూసమస్యలు వస్తున్నాయని వాటికి సత్వర పరిస్కారం చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తన బిడ్డ లాంటి వారని వారి ఎదుగుదల కోసం ఎంతవరకైనా పోరాడాతానని ఆమె అన్నారు. దత్తత తీసుకున్న రెండు గ్రామాలతో పాటు నియోజక వర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రితో కొట్లాడైనా కుప్పం నియోజకవర్గంను కనీవినీ ఎరుగని రితిలో అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకొంటామని నారా భువనేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఇంచార్జి మునిరత్నం, డా.సురేష్ బాబు, మండల అధ్యక్షులు బాబు నాయుడు, మునిసిపల్ అధ్యక్షులు రాజ్ కుమార్, మాజీ సర్పంచ్ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

బుధవారం, జూలై 24, 2024

# యువత 'మత్తు' వదలాలి....!

దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉంది. దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు,నైపుణ్యం అవసరం. దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువత సొంతం. మార్పు రావాల్సింది యువతలో, మార్పు తేవాల్సింది కూడా యువతే. కానీ నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడి జ్ఞానాన్ని, విచక్షణను,శక్తిసామర్థ్యాలను కోల్పోయి నిర్వీర్యమై, నిస్తేజంగా మారుతున్నారు గంజాయి,డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాల వినియోగం వలన యువశక్తి పెడదారి పడుతున్నది. యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్టవేసేందు చేస్తున్న కృషి ఫలించడం లేదు. ఇంకా పకడ్బందీగా చర్యలకు తెగబడాల్సిన అవసరం కనిపిస్తున్నది. ఎందుకంటే సకల అనర్థాలకు అరాచకాలకు హత్యలకు ప్రేరణగా నిలిచే గంజాయి డ్రగ్స్ వాడకం వంటి మత్తు వ్యసనాలను దూరం చేయకుండా సమాజం బాగుపడదు. ఇది నగరాలు, పట్టణాలే కాదు మారుమూల గ్రామాలకు వ్యాప్తి చెందడం అత్యంత ఆందోళన కలిగించే విషయం. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వలన కలిగే విపరీత పరిణామాలను అవగతం చేసుకున్న అంతర్జాతీయ సమాజం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నప్పటికీ, డ్రగ్స్ మహమ్మారి ఇంకా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నదే తప్ప, సమిసిపోవడం లేదు. 1987వ సంవత్సరంలో వియన్నాలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక సదస్సు నిర్వహించారు. ప్రపంచంలోని అన్నిదేశాలు డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడానికి తమ వంతు ప్రయత్నాలు చేస్తూ చట్టాలకు పదునుపెడుతున్నాయి. 1987లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డ్రగ్స్ లేని అంతర్జాతీయ సమాజానికై పిలుపునిచ్చింది. తాగుడు వ్యసనంతో పాటు డ్రగ్స్ వ్యసనం కూడా సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నది. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాల వలన వివిధ దేశాల ప్రభుత్వాలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 మిలియన్ల మందికి పైగా డ్రగ్స్‌కు బానిసలని కొకైన్, మార్జువానా, మార్ఫిన్, చరస్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా వినియోగించడం జరుగుతున్నదని గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఇతర దేశాల విషయం పక్కన బెడితే భారత ప్రభుత్వం 1985లోనే మాదక ద్రవ్యాల వ్యతిరేక చట్టం "ఎన్.డి.పి.ఎస్" తీసుకురావడం, తర్వాత పలు సవరణలతో ఈ చట్టాన్ని పటిష్టం చేసింది. ఈ డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి మానవ ప్రపంచంతో సంబంధాలుండవు. మంచి-చెడు విచక్షణ కనిపించదు. స్వప్నలోకాల్లో విహరిస్తూ, మత్తు వదలిన తర్వాత అనేక శారీరక, మానసిక బలహీనతలకు గురై, మళ్లీ అదే మత్తుకోసం చేయకూడని ఆకృత్యాలన్నీ చేస్తారు. డ్రగ్స్ మాఫియా వలలో చిక్కి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి, చట్టవిరుద్ధమైన డ్రగ్స్ రవాణాకు పాల్పడతారు. తెలుగు రాష్ట్రాల్లో లక్షల కోట్ల విలువైన 25 వేల కిలోల మాదక ద్రవ్యాలు విశాఖ పోర్టుకు దిగుమతయ్యాయి. కాకినాడకు ఆక్వా ఎక్స్‌పోర్టు సంస్థకు సరఫరా అవుతున్నట్లు సిబిఐ గుర్తించింది. హైదరాబాద్ శివార్లలో రసాయనాల తయారీ ముసుగులో మాదక ద్రవ్యాల తయారీ గుట్టుగా సాగుతుంది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పోర్టులను, ఎయిర్‌పోర్టులను ప్రయివేట్ పరం చేసిన తర్వాత డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆదానీకి చెందిన ముంద్రా పోర్టులో రూ.3వేల కోట్ల డ్రగ్స్ పట్టుబడింది. కేవలం సంఘటనలు జరిగినపుడు ప్రభుత్వాలు అధికార యంత్రాంగం హడావిడి చేస్తున్నారే తప్పా నిరంతర నిఘా కొరవడింది. యాంటి నార్కోటిక్స్ బ్యూరోని బలోపేతం చేసి మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నా, డ్రగ్స్ వినియోగం తగ్గడం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలి. అదేవిధంగా అక్రమ రవాణాను అడ్డుకోవాలి. రాష్ట్రంలోనూ గంజాయి,డ్రగ్స్ దందా విస్తరిస్తున్నది. బడిపిల్లల నుండి వర్సిటీ స్టూడెంట్స్ దాకా రోజు కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు ముఖ్యంగా సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ మత్తు మహమ్మారికి బానిసలౌతున్నారు. సామాజిక న్యాయం, సాధికారతపై ఏర్పాటయిన పార్లమెంటరీ స్థాయి నివేదిక ప్రకారం రాష్ట్రంలో 29 లక్షల మంది మత్తుపదార్థాలు సేవిస్తున్నారని తెలిపింది. గంజాయి కొనడానికి డబ్బుల్విలేదని కన్నవారినే కడతేర్చిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. గంజాయి దొరకడం లేదని, గంజాయికి, డ్రగ్స్ కి బానిసలై మత్తు నుంచి బయటపడలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. మధ్యతరగతి ప్రజానీకమే లక్ష్యంగా పోలీసుల కన్నుగప్పి అంతరపంటగా గంజాయిని సాగుచేయడం దాన్ని యువతరానికి అలవాటు చేసి, ఆ తర్వాత మత్తు పదార్థాలకు బానిసలను చేస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కౌన్సిలింగ్ నిర్వహించాలి. విద్యా సంస్థల్లో అవగాహనా సదస్సులు పెట్టాలి. విద్యా సంస్థల దగ్గర ఉండే చిన్న చిన్న దుకాణదారులకు సైతం డ్రగ్, గంజాయి అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించాలి.

# ఫీజు బకాయిలు చెల్లించాలి

## - బి.ఆర్.ఎస్.వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రోజున తెలంగాణ భవన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లు మరియు ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యా సంవత్సరం విద్యా మొదలై రెండు నెలల గడుస్తున్న ఇంతవరకు విద్యార్థుల సమస్యల మీద విద్య వ్యవస్థ పైన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టమని, అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మరియు విద్యశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.కొన్ని కళాశాల యజమాన్యాలు విద్యార్థులకు టీసీలు కూడా ఇవ్వడంలేదని,పై చదువులకు విద్యార్థులు వెళ్ళలేకపోతున్నారని, రేపు నిర్వహించబోయే బడ్జెట్ సమావేశాలలో విద్యార్థులకు బడ్జెట్ లో 30% కేటాయించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని,వచ్చే నెల ఐదు లోపు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లు,ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోతే జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్,నాయకులు కోడం వెంకటేష్.,రుద్రవేణి సుజిత్,వావిలాల సాయిశ్రీనివాస్,కోడి రోహిత్ సాయి, మూడం సాయి,బైరాగిని హర్షిత్, మిర్యాల సంపత్,సిద్ధార్థ, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి విజిబుల్ పోలీసింగ్‌కు...

# అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### - కేసుల చేదనకు సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాలు ఉపయోగించాలి: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్






**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం రోజున పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సమస్యలతో స్టేషన్ కు వచ్చే ప్రజల ఫిర్యాదులు స్వీకరించి ఎలాంటి జాప్యం చేయకుండా వాటి పరిష్కారానికి, విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.కేసుల దర్యాప్తులో, నేరస్తులను పట్టుకోవటంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సీసీ కెమెరాలను ఉపయోగించి చేధించాలని అధికారులకు సూచించారు. కేసు నమోదయిన వారం రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని,స్టేషన్ అధికారులు ప్రతి రోజు పెండింగ్ కేసులను సమీక్షా జరపాలని,దర్యాప్తులో వున్న కేసుల్లో బాధితులకు వీల్కెనంత వరకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. డిఎస్పీ స్థాయి, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు తరచు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను సందర్శింస్తూ స్టేషన్ పరిధిలో నమోదు అయ్యే నేరాలపై, తదితర అంశాలపై రివ్యూ చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీ షీటర్ల పట్ల,హిస్టరీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు వారిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సోషల్ మీడియా నిఘా ఉంచి శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా పోస్ట్ చేసే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి క్రయ, విక్రయాలు,అక్రమ రవాణాపై నిఘా ఉంచి నిర్మూలిస్తూ,యువత గంజాయి బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నేరాల చెదనలో సీసీ కెమెరాల పాత్ర ప్రజలకు వ్యాపారస్తులకు తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేసేలా అవగాహన కల్పించాలని,సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో 100 మంది కన్నా ఎక్కువ జనసంచారం ఉండే వ్యాపార ,వాణిజ్య సంస్థల్లో తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎంఫైర్స్మెంట్ యాక్ట్ లో భాగంగా సీసీ కెమెరాలు ఉండాలని,ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి తనిఖీ చేసిన సమయంలో సీసీ కెమెరాల లేకున్నా, పని చేయకున్న సంబంధిత యజమాని పై తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎంఫైర్స్మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరుగు ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సూచి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు చంద్రశేఖర్ రెడ్డి, మురళి కృష్ణ, సి.ఐ లు కృష్ణ, మొగిలి,శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మాధుకర్, శ్రీనివాస్, శ్రీలత, ఆర్.ఐ లు మాధుకర్, యాదగిరి, రమేష్, ఎస్.ఐ లు ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని పోతారం గ్రామంలో 15 సంవత్సరాలుగా మూతపడి, తిరిగి ప్రభుత్వ ఆదేశాలతో తెరుచుకున్న ప్రాథమిక పాఠశాలను మంగళవారం సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సందర్శించారు. మూతపడి పునరుద్ధరించిన సందర్భంగా గ్రామస్తులకు, పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పూర్వ గ్రామ కార్యదర్శి జ్యోతిని,మల్టీపర్పస్ వర్కర్ కోడముంజ బాబు లను పాఠశాల పునరుద్ధరణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనిచేసినందున కలెక్టర్ వారిని అభినందించారు. పాఠశాల మౌనిక వస్తువుల కల్పనలో భాగంగా పాఠశాల మైనర్ రిపేర్లు,గేటు నిర్మాణం,నీటి వసతి, కరెంటు సదుపాయం కొరకు అంచనాలను తయారుచేసి పంపించాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి, డిఈ మహేష్, సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, రంగనాథ్, ఎంపీడీవో లక్ష్మప్ప, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి,ఎంపీఓ విష్ణు, ఎమ్మెల్వో మహతి లక్ష్మి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ సమ్మయ్య, ఎలక్ట్రిసిటీ ఏఈ చాంద్ పాషా, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి రేణుక, పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీడబ్ల్యు బాబు, పిల్లల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.


# తెలంగాణకు కేంద్రం మొండి చేయి

### - బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి ఎల శేఖర్ బాబు



కేంద్ర బడ్జెట్ లో ఈ సారైన తెలంగాణ కోసం నిధులు కేటాయిస్తారని యావత్ తెలంగాణ చూసింది కానీ మళ్ళీ అదే మొండిచెయ్యి దక్కిందనీ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి ఎల శేఖర్ బాబు తెలిపారు. జాతీయ పార్టీలకు పదహారు మంది ఎంపిలు ఉన్న ఒక్క రూపాయి కూడ తేలెకపోయారనీ,కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వర్యులు నిర్మల సీతారమన్ 48,21,000 కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ ఉత్తరాది రాష్ట్రాలకు మరియు ఆంద్రప్రదేశ్ కు మాత్రమే పెద్దపీట వేశారని,గతంలో కేసీఆర్ గారు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరచిన హామీలను అమలు చేసి తెలంగాణ రాష్ట్రానికి న్యాయం చెయ్యాలని అనేకసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయం ఇక్కడి ప్రజలకు తెలియనిది కాదని,కనీసం ఈసారి అయిన బడ్జెట్ మన తెలంగాణ రావలసిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, అదేవిధంగా పోలవరం కోసం ప్రత్యేక నిధులు పెట్టినట్లు తెలంగాణ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక నిధుల కేటాయిస్తారనీ,నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఎదురు చూసిన బిజెపి నాయకత్వంలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలను ఈ బడ్జెట్ నిట్ట నిలువుగా ముంచిందనీ, ఆ పార్టీ మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# ఆ నలుగురికి భూమి మీద నూకలు



**అదిలాబాద్, జూలై :** భూమ్మీద నూకలు ఉంటే చాలు.. బ్రహ్మ దేవుడు గీసిన ఆయుష్షు రేఖ బలంగా ఉంటే చాలు.. నరకపు చివరి అంచులకు వెళ్లినా కూడా బతికి రావచ్చు అంటారు పెద్దలు. అలాంటిదే వీరి జీవితంలో కూడా జరిగింది. లేకపోతే వాళ్లు ఎదుర్కొన్న ప్రమాదం నుంచి బయట పడడం అంటే అంత ఆషామాషి వ్యవహారం కాదు. పైగా వారు ప్రమాదానికి గురైన ప్రాంతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోది. పైగా అది దట్టమైన ఆడవి. ఒక మాటలో చెప్పాలంటే సెల్ ఫోన్ సిగ్నల్ కూడా అంతంత మాత్రమే. అలాంటి చోట ప్రమాదానికి గురి కావడం.. బతికి బయట పడటం.. మామూలు విషయం కాదు. ఆ ప్రమాదం నుంచి బయటపడిన తర్వాత వారు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. తమను కాపాడిన అగ్నిమాపక, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం అర్ధరాత్రి.. అప్పటికి సమయం రెండు గంటలు దాటింది. జోరున వర్షం కురుస్తోంది. దానికి తోడు దట్టమైన మేఘాలు.. వాతావరణంలో మార్పుల వల్ల పొగ మంచు కూడా అలముకుంది. ఈ సమయంలో ఆ రోడ్డుమీదుగా ఒక కారు వేగంగా వెళ్తోంది. సరిగ్గా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామం సమీపంలో మహబూబ్ ఘాట్ లో అదుపుతప్పింది. అతివేగం వల్ల ఎడమవైపు వెళ్లాల్సిన కారు కుడివైపు మళ్ళింది. అక్కడ ఉన్న ఒక లోయలోకి దూసుకుపోయింది. కారు వేగానికి ఏకంగా 200 అడుగుల దిగువకు వెళ్ళింది. ఒక టేకు చెట్టుని ఢీ కొట్టి అక్కడే నిలిచిపోయింది.. అదే సమయంలో కారులో ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాలేదు. అయితే ప్రమాద తీవ్రత వల్ల ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నామో.. అందులో ప్రయాణిస్తున్న వారికి అర్థం కాలేదు. అయితే బతికి బట్ట కట్టామనే భావన మాత్రం వారిలో ఉంది. తీవ్ర భయాల మధ్య ఆ సమయంలో వారు డయల్ 100 కు ఫోన్ చేశారు. ఆ తర్వాత అద్భుతం జరిగి.. వారంతా ప్రాణాలతో బయటపడ్డారు. హైదరాబాద్ నగరానికి చెందిన అనగన మండల రాధాకృష్ణ, ఆయన భార్య వెంకట దుర్గ, కుమారుడు ప్రేమ్ సాయి కారులో మహారాష్ట్రలోని నాగ్ పూర్ బయలుదేరారు. అక్కడ వారి బంధువుల ఇంట్లో వేడుక ఉండడంతో.. దానికి హాజరయ్యేందుకు వారు కారులో ప్రయాణమయ్యారు. రాధాకృష్ణ కారు నడుపుతున్నాడు. కారు నిర్మల్ పట్టణం దాటి సుమారు పది కిలోమీటర్లు వచ్చింది. మహబూబ్ ఘాట్ పరిధిలోకి వచ్చింది. ఇదే సమయంలో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో వాహనం ఒక్కసారిగా అదుపుతప్పింది. ఆ సమయంలో కారు విపరీతమైన వేగంతో ఉంది. ఫలితంగా లోయలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో రాధాకృష్ణ కుటుంబ సభ్యులు డయల్ 100 కి ఫోన్ చేశారు.. దీంతో నిర్మల్ డిసిఆర్బి సిఐ గోపీనాథ్, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్, డ్రైవర్ ముగ్గురు వెంటనే ఘటన స్థలానికి వెళ్లారు. కారులో ఉన్న వారంతా ప్రాణాలతో ఉన్నట్టు గుర్తించారు. వారిని పైకి తీసుకొచ్చేందుకు 101 కు ఫోన్ చేసి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు కూడా తక్షణమే ఘటన స్థలానికి వచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది పెద్ద తాడు సహాయంతో రాధాకృష్ణ కుటుంబ సభ్యులను ఒక్కొక్కరిని ఘాట్ పైకి తీసుకొచ్చారు. అప్పటికి సమయం మూడు గంటల 15 నిమిషాలు అవుతోంది. కద్దాల్ వద్ద రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రాధాకృష్ణ తప్పుడు అంచనా తో నిర్మల్ పట్టణం మీదుగా మహబూబ్ ఘాట్ వైపు కారు మళ్ళించారు. ఆ సమయంలో వారు జాతీయ రహదారి మీదుగా ప్రయాణం చేస్తే మహబూబ్ ఘాట్ తగిలేదికాదు.. తప్పుడు అంచనా తో కారును మళ్లించడంతో ఈ ప్రమాదం జరిగింది. చావు చివరి అంచు దాకా వెళ్లి.. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో రాధాకృష్ణ కుటుంబ సభ్యులు బతికి బట్టకట్టారు. వాస్తవానికి ఆ ప్రమాదం జరిగిన తీవ్రతకు బతికేందుకు 0.1% కూడా బతికే అవకాశం లేదు. కానీ రాధాకృష్ణ కుటుంబ సభ్యులు అత్యంత తెలివిగా డయల్ 100 కు ఫోన్ చేయడం.. పోలీసులు స్పందించడం.. 101 కు పోలీసులు ఫోన్ చేస్తే అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవడం.. వంటి ఘటనలు చక చకా జరిగిపోవడంతో రాధాకృష్ణ కుటుంబ సభ్యులు పునర్జన్మ పొందారు. అయితే ఈ ఘటనపై జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క స్పందించారు. నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. సీఐ గోపీనాథ్, ఎస్సై శ్రీకాంత్, అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు. త్వరలో వారిని అవార్డులకు సిఫారసు చేస్తామని ఆమె ప్రకటించారు.

# మూసీ ప్రక్షాళనకు తడిసిమోపెడు



**హైదరాబాద్, జూలై :** భాగ్యనగరంలో ఒకప్పుడు మూసీ నదికి ఎంతో ఘనమైన చరిత్ర ఉండేది.దాని మీద ఆధారపడి వ్యవసాయాధారిత పనులు నిర్వహించుకునేవారు. తాగు నీటి అవసరాలు తీర్చడంలోనూ మూసీ తన ప్రత్యేకత చాటుకునేది. హైదరాబాద్ పరిసర ప్రాంతాలనుంచి నల్గొండ దాకా మూసీ ప్రవాహం సాగేది. అలాంటి ఘనమైన చరిత్ర కలిగిన మూసీ ప్రస్తుతం మురికి కూపంగా మారిపోయింది. ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలకులు మారుతున్నారు..మూసీకి ఇవి చేస్తాం..అవి చేస్తాం..అని ఊదరగొట్టడమే తప్ప ప్రక్షాళనకు ఇన్ని కోట్లు, అన్ని కోట్లు అంటూ కాలయాపన చేయడం తప్ప ఇంతవరకూ మూసీ నదిపై ఆ ప్రయత్నాలేమీ సాగడం లేదు.దాదాపు 267 కిలోమీటర్లు ప్రవహించి కృష్ణానదిలో కలిసే మూసీ నది..కాలుష్య కారకాలు, పరిశ్రమల వ్యర్థాలతో నిండుకుని విషవాయువులు వెదజల్లుతోంది. మూసీ పరివాహక పంటలు సైతం దాని ప్రభావంతో విషతుల్యమవుతున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. మూసీకి ఆనుకుని దాదాపు పన్నెండు వేల పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు వదిలే రసాయనాలు, వ్యర్థాలు మూసీని మురికికూపంగా మార్చేశాయి. ఇక హైదరాబాద్ కాలనీల మధ్య నుంచే ప్రవహించే నాలాలు షుమారు 50కి పైగా ఉన్నాయి. నాలాలనుంచి వెలువడే చెత్తాచెదారం అంతా చివరకు కలిసేది మూసీ నదిలోనే. ఇక మూసీ నది ప్రక్షాళన కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బోర్డును ఏర్పాటుచేసింది. మూసీ నదిని ప్రక్షాళన చేసేందుకు అయ్యే వ్యయాన్ని ఈ సంస్థ అంచనా వేసి అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వానికి నివేదికలు పంపింది. నివేదికల ఆధారంగా విడుదల చేసిన నిధులు దుర్వినియోగం అయ్యాయని అప్పట్లో ప్రతిపక్షాలు గోలపెట్టాయి.ఐదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ నది బ్యూటిఫికేషన్ పనులకు శ్రీకారం చుట్టింది. మూసీ పరివాహక ప్రదేశాలలో అక్రమ నిర్మాణాలు, పిచ్చి మొక్కలు తొలగించి వాటి స్థానంలో సుందరమైన పార్కులు, బోటింగ్ ట్రిప్ లు ఏర్పాటు చేసి పర్యాటకులకు ఆకర్షణీయ కేంద్రంగా మార్చాలని భావించి అప్పట్లో ఈ బ్యూటిఫికేషన్ పనుల కోసం కేసీఆర్ సర్కార్ దాదాపు రూ.4000 కోట్ల వరకూ నిధులు విడుదల చేస్తామని ఊదరగొట్టారు. అవన్నీ ప్రకటనల వరకే తప్ప నిధులు మాత్రం విడుదల చేయలేదు. కేవలం నాలుగు వందల కోట్లను మాత్రమే విడుదల చేసి చేతులు దులిపేసుకుంది. చాలీచాలని నిధులతో పూర్తి స్థాయి బ్యూటిఫికేషన్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి కూడా అధికారంలోకి రాగానే మూసీపై నెలరోజులకొకసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని..మూసీ ప్రక్షాళనకు దాదాపు లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టాలని భావించారు. ఓ పక్కన రైతు రుణ మాఫీ, సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర సర్కారుకు తలకుమించిన భారంగా తయారయింది.ఇంత భారీ ఖర్చు పెట్టి మూసీని ప్రక్షాళన చేసినా ..హైదరాబాద్ నగరం గుండా ప్రవహించే నాలా నీరు కలిసేది మూసీ లోనే. మూసీ ప్రక్షాళన కన్నా ముందుగా నాలాని తరలించాలి. మళ్లీ నాలా ను తరలిస్తే కొన్ని వేల కోట్లు..అలాగే రసాయన, ఫార్మా పరిశ్రమలన్నీ కూడా తరలించాల్సి వస్తుంది. ఇవన్నీ ప్రభుత్వానికి తలకు మించిన భారమే. దీనిపై ఎంత ఖర్చుపెట్టినా వృథాయే అని కొందరు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. కేసీఆర్ కూడా ఇన్ని లొసుగులున్నాయనే మూసీ ప్రక్షాళన అంశాన్ని లైట్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా మూసీ ప్రక్షాళన అంశాన్ని పక్కకు పెట్టాలని భావిస్తోంది. మూసీ ప్రక్షాళన అంశం మరుగున పడే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది.నిధులు కేటాయించండిహైదరాబాద్ లోని మురికి నీరు అంతా మూసీలో చేరుతోందని, దానిని శుద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని కేంద్ర మంత్రికి తెలిపారు. జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక కింద మూసీలో మురికి నీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు, గోదావరి నది జలాలను ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లతో నింపే పనులకు రూ.6 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు సీఎం రేవంత్ రెడ్డి. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ను గోదావరి నీటితో నింపితే హైదరాబాద్ నీటి ఇబ్బందులు ఉండవని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు.

# యోగికి చెక్ పెడతారా



**లక్నో, జూలై :** యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్‌కు చెక్ పడేలా బీజేపీలో అడుగులు పడుతున్నాయా? పార్టీలో? యూపీ ప్రభుత్వంలో యోగికి కంట్లో నలుసులా తయారైన డిప్యూటీ సీఎం కేపీ మౌర్యకు బీజేపీ అధ్యక్షుడిని చేయడం ద్వారా? యోగి హవాకు బ్రేక్ వేయాలని పార్టీలో మరో వర్గం ప్రయత్నిస్తోందా? పార్లమెంట్ ఎన్నికల్లో సగం సీట్లు కోల్పోవడం? యోగి ప్రత్యర్థులు ఆయుధంగా మార్చుకున్నారనే టాక్ వినిపిస్తోంది. యోగి హవాకు బ్రేక్ వేయడానికి ఇదే తగిన సమయంగా భావిస్తున్న ఆయన ప్రత్యర్థులు చురుగ్గా పావులు కదుపుతున్నారటబీజేపీ జాతీయ రాజకీయాలు హీట్‌పుట్టిస్తున్నాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్యను నియమించవచ్చని ప్రచారం జరుగుతోంది. పార్టీ భావి నేతగా భావిస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు చెక్ చెప్పడానికే మౌర్యను తెరపైకి తెస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఐతే మౌర్య యూపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే 2017లో ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్న కారణం చూపి? మౌర్యను జాతీయ అధ్యక్షుడిగా చేయాలని ప్రతిపాదన తెరపైకి తెస్తున్నారు.వెనుకబడిన వర్గాలకు చెందిన మౌర్యను జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చేస్తే.. బీసీలను తమ వైపునకు తిప్పుకునేందుకు ఉపయోగపడుతుందని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడైన మౌర్యను 2017లోనే యూపీ ముఖ్యమంత్రిగా నియమించాలనుకున్నప్పటికీ.. యోగి ఆదిత్యనాథ్ రంగంలోకి దిగడంతో అది సాధ్యం కాలేదు. మౌర్యకూ యోగికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్నట్లు విభేదాలున్నాయని, యోగి ప్రతి కదలికనూ ఆయన ఢిల్లీకి చేరవేస్తారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.గత లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ పలు సీట్లు కోల్పోవడంపై యోగిని జవాబుదారీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే, ఈ ఓటమితో తనకు సంబంధం లేదని, తనను సంప్రదించకుండా అభ్యర్థులను ఎంపిక చేశారని యోగి అన్నట్లు సమాచారం. త్వరలో యూపీలో పది అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలు యోగి భవిష్యత్తును నిర్ణయించవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ఉప ఎన్నికలకు ముందే బీజేపీకి జాతీయ అధ్యక్షుడిగా కేశవ్ ప్రసాద్ మౌర్యను నియమిస్తారా..? లేదా..? అన్నదానిపై స్పష్టత లేదు.మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మౌర్యనే జాతీయ అధ్యక్షుడిగా నియమించడం ద్వారా యోగిని ఇరకాటంలో పెట్టాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఇటీవల బీజేపీ పెద్దలను కలిసిన మౌర్య? పార్టీ కంటే ఎవరూ గొప్పవారు కాదన్న వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. యూపీ సీఎం యోగిని దృష్టిలో పెట్టుకునే ఆయనీ వ్యాఖ్యలు చేశారంటున్నారు. మొత్తానికి యోగి ఆధిపత్యానికి చెక్ చెప్పేలా అడుగులు పడుతున్నాయంటున్నారు.

# ఏఐతో ఉద్యోగాలపై ప్రభావం




**న్యూఢిల్లీ, జూలై :** ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్ (ఎఐ) ప్రపంచాన్ని శాసిస్తోంది. దాదాపు అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం అనివార్యంగా మారింది. సెర్చ్ ఇంజన్స్‌మొదలు సోషల్ మీడియా సైట్స్ వరకు ఏఐని ఉపయోగిస్తున్నాయి. ఇక ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తొలి రోజుల్లో నుంచి ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని వార్తలు వస్తూనే ఉన్నాయి. దీనికి అనుగుణంగా ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున జరుగుతోన్న ఉద్యోగాల కోతలు, కొత్త రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ఈ వార్తలకు బలాన్ని చేకూర్చినట్లైంది.అయితే తాజాగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే కూడా ఇదే విషయాన్ని చెబతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగులపై కచ్చితంగా తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఆర్థిక సర్వే సైతం వెల్లడించింది. ఉద్యోగాల కల్పనపై ఏఐ ప్రతికూల ప్రభావం చూపడం ఖాయమని కేంద్ర ప్రభుత్వం హెచ్చరిస్తోంది. కృత్రిమ మేధ ఉత్పదకతను పెంచుతుందననడంలో ఎంత వరకు నిజం ఉందో.. ఈ ప్రభావం అనేకరంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల మీద పడుతుందనడంలో కూడా అంతే నిజం ఉందని సర్వేలో పేర్కొన్నారు.రోజుల్లో దాదాపు ప్రతీ రంగంలో ఏఐ మార్పులను తీసుకొచ్చిందని, దీంతో ఆయా రంగాల్లో ఉద్యోగుల సంఖ్య ఖాయమని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఈ ఏఐ ప్రభావం భారత్‌తో పాటు ప్రపంచంలోని చాలా దేశాలపై కచ్చితంగా ప్రభావం చూపనుందని పేర్కొన్నారు. ఈ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలో ఊహకందని మార్పులు జరిగే అవకాశం ఉందని సర్వేలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే సర్వేలో పేర్కొన్న విషయాల ప్రకారం ఇప్పటికే చాలా రంగాల్లో ఏఐ వాడాకాన్ని బాగా పెంచేశారు.ఐటీ కంపెనీలతో ఇతర కంపెనీల్లో కూడా ఏఐ వినియోగాన్ని పెంచేశారు. కస్టమర్లకు మెరుగైన సేవలను అందించడంతో పాటు, ఉద్యోగులను తగ్గించుకోవచ్చనే ఉద్దేశంతో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా.. కస్టమర్ సర్వీస్, టీచింగ్, యాంకరింగ్ వంటి రంగాలపై కూడా ప్రభావం పడనుందని నిపుణులు అంచణాలు వేస్తున్నారు. ఏఐకి సంబంధించిన నైపుణ్యాలను నేర్చుకుంటేనే ఉద్యోగులు రాణించగలని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు

# తడిసి ముద్దవుతున్న వరంగల్



**వరంగల్, జూలై :** బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జోరు వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండగా, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర్ ఘాట్ సమీపంలో గోదావరి కరకట్టకు ప్రమాదం పొంచి ఉందివర్షాల నేపథ్యంలో గోదావరిలో నీటి ప్రవాహం పెరగగా, రామన్నగూడెం వద్ద కరకట్ట కోతకు గురవుతోంది. దీంతో ఏటూరు నాగారం, మంగపేట మండలాల్లోని గోదావరి తీర ప్రాంత గ్రామాల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఏటూరు నాగారం మండలంలోని బెస్త వాడ, ఎస్సీ కాలనీ, రామన్నగూడెం, కొత్తూరు, బుట్టాయిగూడెం; మంగపేట మండలంలోని పోదూరు, అక్కినపల్లి, కమలాపూర్, వాడగూడెం, రమణక్కపేట, కత్తిగూడెం, గుడ్డేలుగుల పల్లి, మంగపేట, బోర్ నర్సాపూర్ గ్రామాలను తరచూ వరదలు వణికిస్తుండగా, కరకట్ట కోతకు గురవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.ములుగు జిల్లాలోని గోదావరి తీర ప్రాంతంలో కరకట్ట నిర్మాణం, మరమ్మతు పనులకు గతంలోనే ప్రభుత్వం దాదాపు రూ.వంద కోట్లకుపైగా నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు రామన్నగూడెం వద్ద జియో ట్యూబ్స్ తరహాలో నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రచించారు.కాగా ఇటీవల వరదల నేపథ్యంలో పనులు నిలిచిపోగా, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా రామన్నగూడెం వద్ద కరకట్ట కొద్దికొద్దిగా కోతకు గురవుతోంది. దీంతో ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. స్థానికులు సమస్యను ఇరిగేషన్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.కరకట్ట కోతకు గురవకుండా మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే గోదావరిలో నీటి ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతుండగా, మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఆఫీసర్లు అలర్ట్ అయ్యారు. ఈ మేరకు లోతట్టు గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ములుగు జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. జాకారం, గట్టమ్మ ఆలయం మధ్యలో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.వర్షంలోనే లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ఆఫీసర్లకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాతీయ రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజల రవాణా సౌకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ములుగు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు ఎవ్వరూ రావద్దని సూచించారు. ముఖ్యంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో చేపల వేటకు వెళ్లకూడదన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, జిల్లా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# సునీతా విలియమ్స్ వచ్చేది ఎప్పుడు



**న్యూయార్క్, జూలై :** సునీతా విలియమ్స్‌తోపాటు, బుచ్ విల్మోర్‌ను నాసా ఈ ఏడాది జూన్ 6వ తేదీన అంతరిక్షంలోకి పంపించింది. బోయింగ్ సంస్థ తయారు చేసిన స్టార్ లైనర్‌లో వీరు ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్‌కు వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం వీరు కేవలం వారం రోజులు అంటే.. జూన్ 14 వరకే అక్కడ ఉండాలి. 15వ తేదీన తిరిగి భూమికిరావాలి. కానీ సునీతా విలియమ్స్, విల్మోర్ నెల రోజులకుపైగా అంతరిక్షంలోనే ఉన్నారు. వీరిని ఐఎస్ఎస్‌లోకి తీసుకెళ్లిన స్పేస్ రాకెట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో వారు అక్కడే ఉండిపోయారు. అయితే స్టార్‌లైర్‌కు నాసా మరమ్మతులు చేపట్టింది. కానీ అవి సత్ఫలితాలు ఇవ్వడం లేదు. నాసా సైంటిస్టుల సూచన మేరకు ఐఎస్ఎస్‌లో ఉన్న సైంటిస్టులు కూడా స్టార్‌లైనర్‌కు మరమ్మతులు చేస్తున్నారు. కానీ, ఇప్పటివరకు స్టార్‌లైన్ తిరిగి భూమికి చేరే తేదీపై నాసా స్పష్టత ఇవ్వడం లేదు. ఇదిలా ఉండగా తాంము బోయిగ్ స్పేస్ క్యాప్సూల్ స్టార్‌లైనర్‌లో అంతరిక్షంలోకి వెళ్లామని, తిరిగి అదే క్యాప్సూల్‌లో భూమికి వస్తామని తెలిపారు. ఈమేరకు వారు అంతరిక్షం నుంచే తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. థ్రస్టర్ పరీక్ష పూర్తయ్యాక తమ తిరుగు ప్రయాణం ఉంటుందని తెలిపారు. ఇదే సమయంలో గడువు దాటినా వ్యోమగాములు మాత్రం నాసాపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఐఎస్ఎస్ సిబ్బందికి సహాయం చేస్తూ ఎంజాయ్ చేస్తున్నామని తెలిపారు. స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ తమను ఇంటికి తీసుకొస్తుందని నమ్మకంతో ఉన్నారు.ఇదిలా ఉంటే.. సునితా విలియమ్స్, బుచ్ విల్మోర్ అంతరిక్షంలోకి వెళ్లి నెల దాటింది. అయినా స్టార్‌లైనర్‌తో తలెత్తిన సమస్యలపైగానీ, ఆస్ట్రోనాట్స్ తిరిగి భూమికి వచ్చే తేదీపైగానీ నాసా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. మరమ్మతులు చేస్తున్నామని మాత్రమే చెబుతోంది. దీంతో వారు ఎప్పుడు భూమికి చేరుకుంటారన్న ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇద్దరూ సేఫ్‌ల్యాండ్ కావాలంటే.. స్టార్‌లైనర్ మరమ్మతులు పూర్తికావాలి. అవి ఎప్పటికి పూర్తవుతాయన్నది కూడా తెలియడం లేదుప్రపంచంలో అతిపెద్ద విమానాల తయారీ సంస్థ బోయింగ్ ప్రపంచ కుబేరుడు తయారు చేయించిన అంతరిక్ష నౌక స్పేస్ ఎక్స్‌కు దీటుగా స్టార్‌లైనర్‌ను తయారు చేసింది. అనేక పరీక్షల తర్వాత నాసా దీనిలో సునీతా విలియమ్స్, బుచ్‌విల్మోర్‌ను అంతరిక్షంలోకి పంపాలని నిర్ణయించింది. ఈమేరు ఇద్దరు ఆస్ట్రోనాట్‌లను సిద్ధం చేసిన తర్వాత రాకెట్‌లో సాంకేతిక సమస్యలతో పర్యటన వాయిదా వేశారు. తర్వాత మళ్లీ కౌంట్‌డౌన్ ప్రారంభించాక స్టార్‌లైనర్‌లో హీలియం లీక్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో మళ్లీ పర్యటన వాయిదా వేశారు. మూడో ప్రయత్నంలో జూన్ 5న స్టార్‌లైన్ నాసా నుంచి అంతరిక్ష కేంద్రంలోకి దూసుకెళ్లింది. అయితే స్టార్‌లైనర్ ఐఎస్ఎస్‌కు చేరుకోకముందే? మళ్లీ హీలియం లీకేజీని గుర్తించారు. అయినా ప్రమాదం లేదని నాసా ప్రకటించింది. ఇద్దరు వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు చేరుకోవడంలో ఊపిరి పీల్చుకున్నారు.సంస్థకు లక్షల కోట్ల వ్యాపారం చేస్తోంది. విమానాలను ప్రపంచ వ్యాప్తంగా విక్రయిస్తోంది. తొలిసారి స్పేస్ రాకెట్ తయారు చేసింది. అయితే అది విఫలమైంది. అయితే.. ప్రతిష్టాత్మక సంస్థ బోయింగ్ వైఫల్యాలను కప్పి పుచ్చేందుకు అగ్రరాజ్యం అమెరికా ప్రయత్నాలు చేస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బోయింగ్ తయారు చేసిన విమానాలు కూలిపోతున్నాయి. మరోవైపు స్టార్‌లైనర్ వైఫల్యాన్ని అధికారికంగా ప్రకటిస్తే.. సంస్థకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలో అమెరికా.. స్టార్‌లైనర్ సమస్యను బయటపెట్టడం లేదని తెలుస్తోంది.ఇక సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ కిందకు రావడానికి ఐఎస్ఎస్‌లో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ అక్కడ సిద్ధంగా ఉంది. అయినా నాసా స్టార్‌లైనర్ మరమ్మతుల పేరుతో కాలయాపన చేస్తోంది. స్పేస్ ఎక్స్‌లో వ్యోమగాములను తీసుకువస్తే.. స్టార్‌లైనర్ విఫలం అయినట్లు అంగీకరించాల్సి ఉంటుంది. దీంతో లక్షల కోట్లు వృథా అవడమే కాకుండా బోయింగ్ ప్రతిష్ట దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలోనే బోయింగ్ సంస్థ ఆ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకు ఉట్ర చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్‌పై దాడి.. మైక్రోసాఫ్ట్ సమస్యలను తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఎప్పుడు భూమికి చేరుతారనే విసయంలో మాత్రం క్లారిటీ లేదు.